అసంపూర్తిగా.. అదనపు గదులు

గంపలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చాలీచాలని గదులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్య పరిష్కారానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడు రెండో విడతలో నిధులు మంజూరు చేసింది. దీనితో పనులను ప్రారంభించారు. సన్‌సైడ్ వరకు వచ్చిన తరువాత నిర్మాణ పనులు గత జూన్ నెలలో నిలిచిపోయాయి. పనులు పూర్తిచేసి తరగతి గదుల కొరత తీర్చాల్సి ఉంది.

- చాలీచాలని గదుల్లోనే తరగతుల నిర్వహణ
- రెండో విడత నాడు–నేడులో గత ప్రభుత్వం నిధులు మంజూరు
- వసతుల కల్పనకు అదే ఏడాది నాబార్డు నిధుల కేటాయింపు
- గత జూన్‌లో నిలిచిన తరగతి గదుల నిర్మాణం
- సరఫరా కాని డెస్కులు, ఐరన్ బీరువాలు



గంపలగూడెం హైస్కూల్‌లో అసంపూర్తిగా నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణం

మొత్తం విద్యార్థులు	345
తరగతుల నిర్వహణ	6 నుంచి 10
ఇప్పుడున్న తరగతి గదులు	20
నిర్మాణంలో ఉన్న అదనపు గదులు	3

గంపలగూడెం: గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు మొత్తం 345 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో 20 గదులు మాత్రమే ఉన్నాయి. వాటిలో ప్రధానోపాధ్యాయుడి ఆఫీసు గది, స్టాఫ్ రూమ్, లైబ్రరీ, లేబొరేటరీ, ఫర్నిచర్ స్టాక్ రూంతో పాటు గంపలగూడెం క్లస్టర్ స్థాయిలో ఉపాధ్యాయుల సమావేశాల నిర్వహణకు మరో రెండు గదులు కేటాయించారు. మిగిలిన గదులు మాత్రమే క్లాసుల నిర్వహణకు కేటాయించారు. దీంతో క్లాస్ రూంల కొరతతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడం లేదు.

నాడు–నేడు నిధులు 40.4 లక్షలతో నిర్మాణ పనులు ప్రారంభం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 2023–24 విద్యా సంవత్సరంలో నాడు–నేడు సెంకడ్ ఫేజ్‌లో మూడు అదనపు గదుల నిర్మాణానికి రూ. 40.5 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో పాటు పాఠశాలలో తగిన వసతులు, సౌకర్యాల కల్పనకు నాబార్డు నిధులు రూ. 58 లక్షలు కూడా మంజూరు చేశారు. నాడు–నేడు నిధులతో పాఠశాల ఉత్తర భాగంలో మూడు తరగతి గదుల నిర్మాణ పనులను గత ఏడాది చేపట్టారు. నిర్మాణ పనులు సన్‌సైడ్ లెవల్‌కు వచ్చి నిలిచాయి. శ్లాబు, ప్లాస్టింగ్, విద్యుదీకరణ ఫ్లోరింగ్ పనులు జరగాల్సి ఉంది. నాబార్డు నిధులతో పాఠశాలలో అండర్ గ్రౌండ్ విద్యుదీకరణ, మరుగుదొడ్ల నిర్మాణం, పెయింటింగ్ పనులను పూర్తి చేశారు. ఈ నిధులతో మంజూరైన రూ. 22 లక్షల విలువ చేసే డెస్కులు, బల్లలు, ఇనుప బీరువాలు సరఫరా కావాల్సి ఉంది.

అధికారులు స్పందించాలి

అసంపూర్తిగా నిలిచిపోయిన మూడు తరగతి గదుల నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేయడంతోపాటు నాబార్డు నిధులతో మంజూరైన బల్లలు, డెస్కులు, ప్రతి తరగతి గదికి ఒక ఐరన్ బీరువా వెంటనే సరఫరా చేయాల్సి ఉంది. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుని పనులను పూర్తి చేయడంతో పాటు విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తరగతి గదుల కొరత



విద్యార్థుల సంఖ్య తరగతి సెక్షన్లను అనుగుణంగా మరో మూడు తరగతి గదులు అవసరం ఉంది. మధ్యలో నిలిచిపోయిన తరగతి గదుల నిర్మాణ పనులకు ప్రభుత్వం నిధులను విడుదల చేసి పూర్తి చేయాలి.

– బొల్లెపోగు కిరణ్, ప్రధానోపాధ్యాయులు

సమస్య పరిష్కారానికి చర్యలు



సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం. మధ్యలో నిలిచిన తరగతి గదుల నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– పీవీడీఎల్ నరసింహారావు, మండల విద్యాశాఖాధికారి

ఓటర్ల నమోదు విధులకు బీఎల్‌ఓల గైర్హాజరు

షోకాజ్ నోటీసులు జారీచేసిన ఆర్డీఓ



తిరువూరులో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ మాధురి

తిరువూరు: ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమ విధులకు గైర్హాజరైన బూత్ లెవెల్ అధికారులకు తిరువూరు ఆర్డీఓ కె. మాధురి శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలల్లో పోలింగ్ బూత్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆర్డీఓ విధులకు గైర్హాజరైన బీఎల్‌ఓలను గుర్తించారు. బీఎల్‌ఓలు తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలు తదితర దరఖాస్తులను స్వీకరించాలని ఆదేశించారు.

ప్రచార లోపంతో ఓటర్లకు చేరని సమాచారం

తిరువూరు మండలంలో 23, 24 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతుందని రెవెన్యూ అధికారులు గ్రామాల్లో ప్రచారం చేయకపోవడంతో ఓటర్ల స్పందన నామమాత్రంగా ఉంది. కొత్త ఓటర్ల నమోదు, సవరణలు, ఓట్ల బదిలీ కోసం పలువురు ఓటర్లు నిత్యం తహసీల్దార్ కార్యాలయం వద్దకు వస్తుండగా.. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని గురించి ప్రచారం చేయకపోవడంతో పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేకపోయామని పలువురు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మైలవరం: నియోజకవర్గంలోని గుంటుపల్లి, గొల్లపూడి పోలింగ్ కేంద్రాలను ఎన్నికల ప్రత్యేకాధికారిగా జీసీహెచ్ కొండారెడ్డి శనివారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. తహసీల్దార్ జి. బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం ఈ నెల 28వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు.

కృష్ణానది జలాలను అందించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

తిరువూరు: దీర్ఘకాలంగా ఎ.కొండూరు మండల ప్రజలు ఎదుర్కొంటున్న కిడ్నీ సంబంధిత సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. సీపీఐ మండల కార్యకర్తల విస్తృత సమావేశం శనివారం ఎ. కొండూరులో దాడి ఆదినారాయణ అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ కిడ్నీ ప్రభావిత ప్రాంతాలకు కృష్ణానది జలాలను అందించే పనులను వేగవంతం చేయాలని, వినగడప వద్ద కట్టలేరుపై వంతెన నిర్మించాలని, చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తిచేసి తిరువూరు నియోజకవర్గానికి సాగు, తాగునీరందించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తాత్కాలిక కార్యదర్శిగా ముచ్చింతాల వెంకటేశ్వరరావు, మండల కమిటీ సభ్యులుగా దాడి ఆదినారాయణ, కొలికపోగు కృష్ణ, పమ్మి మోహనరావు, ఎస్‌కే కరీముల్లా ఎన్నికయ్యారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ట్రాఫిక్ నిబంధనల్లపై అవగాహన కల్పిస్తున్న సీఐ గిరిబాబు

తిరువూరు: విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తిరువూరు సీఐ గిరిబాబు అన్నారు. స్థానిక చైతన్య స్కూల్‌లో శనివారం విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లలు ద్విచక్ర వాహనాలు నడపరాదని, ఆ వయసులో తల్లిదండ్రుల వాహనాలను పిల్లలు నడిపితే నేరమన్నారు. రోడ్డు దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎస్‌ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వన సమారాధన

మైలవరం: మైలవరం ఎస్ఎస్‌కే విద్యార్థులు బయన శ్రీనివాసరావు మామిడితోటలో శనివారం వన సమారాధన నిర్వహించారు. ప్రముఖ జ్యూయలరీ షాపు యజమాని బయన శ్రీనివాసరావు దంపతులు స్వీట్లు పంపిణీ చేసి విద్యార్థులను ఆశీర్వదించారు. విద్యార్థులు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. డైరెక్టర్ మోహనరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కార్తిక వన సమారాధనలు

తిరువూరు: తిరువూరు మండలంలోని పలు సామాజిక సంఘాలు వన సమారాధన కార్యక్రమాలను ఆదివారం నిర్వహించనున్నాయి. రాయల కాపు సంఘం, బ్రాహ్మణ పరిషత్ తదితర సంఘాలు వన సమారాధనకు ఏర్పాట్లు చేస్తున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు ఈ సందర్భంగా నిర్వహించనున్నట్లు ఆయా సంఘాలు తెలిపాయి.

క్లుప్తంగా

విద్యార్థినులకు సైకిళ్లు అందజేత



తిరువూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు శనివారం సైకిళ్లు పంపిణీ చేశారు. రాజుపేటలోని సంక్షేమ వసతిగృహం నుంచి డిగ్రీ కళాశాలకు 3 కిలో మీటర్ల దూరం నడిచి రావడం ఇబ్బందికరంగా ఉందని, కళాశాలకు బస్సు సదుపాయం సైతం లేదని విద్యార్థినులు ఇటీవల కళాశాలకు విచ్చేసిన ఎమ్మెల్యేకి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ఎమ్మెల్యే పది మంది విద్యార్థినులకు సైకిళ్లు అందజేశారు.

డివిజనల్ కార్యాలయం ఏర్పాటు చేయాలని వినతి

తిరువూరు: తిరువూరును ప్రభుత్వం రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించినందున పశు సంవర్ధక శాఖ డివిజనల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఆ శాఖాధికారులు శనివారం ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. తిరువూరు డివిజన్‌లోని ఐదు మండలాల పశు వైద్యశాలలకు అందుబాటులో ఉండే విధంగా డివిజనల్ కార్యాలయాన్ని తిరువూరులో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె. రామారావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



నూజివీడు: పేదలకు ఆరోగ్య భద్రత కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో 15 మంది బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.10 లక్షలకు సంబంధించిన చెక్కులను మంత్రి అందజేశారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బర్మా ఫణిబాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మలిశెట్టి జగదీష్, కౌన్సిలర్ చెరుకూరి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామసభల్లో ఉపాధి పనుల గుర్తింపు

గంపలగూడెం: గాదెవారిగూడెం, పెద్దకొమిర, గోసవీడు, తునికిపాడు, ఆర్లపాడు, సత్యాలపాడు గ్రామాల్లో శనివారం గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రైతుల నుంచి ఇంకుడు గుంతలు, పాంఫాండ్స్(పొలాల్లో సేద్యపు గుంటలు), పాదులు (చెట్లు నాటేందుకు గొయ్యిలు), చెరువు కట్టల బాగుచేత, పంట కాలవల్లో తూటికాడ, సిల్ట్ తొలగింపు తదితర పనులను సూచించారు. ఆయా సభల్లో గ్రామాల పరిధిలో మృతిచెందిన కూలీల జాబ్‌కార్డుల తొలగింపు, నూతనంగా జాబ్ కార్డు కావాల్సిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మదర్ సర్వీస్ సొసైటీ కార్యాలయం ప్రారంభం

మైలవరం: రెడ్డిగూడెంలోని మదర్ సర్వీస్ సొసైటీ సేవా సంస్థ నూతన కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. సంస్థ సేవలను పలువురు కొనియాడారు. టీడీపీ నాయకుడు ఉయ్యూరు వెంకటేశ్వరరెడ్డి(పెదబాబు), సంస్థ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్స్, బీసీ నాయకులు పాల్గొన్నారు.

వన్‌వే నిబంధనలు పాటించాలి

ఆగిరిపల్లి: ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా శనివారం నుంచి ఆగిరిపల్లిలో వన్ వే నిబంధనలు తప్పకుండా పాటించాల్సిందేనని ఎస్‌ఐ శుభశేఖర్ అన్నారు. విజయవాడ నుంచి నూజివీడు వైపు వెళ్లే వాహనాలు ఎస్‌బీఐ నుంచి బ్రాహ్మణ బజార్ మీదుగా వెళ్లాలని, నూజివీడు వైపు నుంచి విజయవాడ వెళ్లే వాహనాలు బస్టాండ్ మీదుగా మెయిన్ రోడ్డు నుంచి వెళ్లాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకుంటే వాహనదారులకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

తృటిలో తప్పిన ప్రమాదం

చాట్రాయి: ఆయిల్ ట్యాంకర్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. చింతలపూడి నుంచి విస్సన్నపేట వైపునకు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ లారీ చాట్రాయి సెంటర్‌లో రోడ్డు మార్జిన్‌లోకి దిగబడిపోయి పక్కకు ఒరిగింది. దీంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. జేసీబీతో ఆయిల్ ట్యాంకర్‌ను బయటకు తీసి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

వ్యభిచార గృహంపై దాడి: ముగ్గురి అరెస్ట్

మైలవరం: మైలవరం ఎస్‌వీఎస్ నగర్‌లో వ్యభిచార గృహంపై శనివారం పోలీసులు దాడి చేశారు. మైలవరానికి చెందిన నిర్వాహకురాలు ఇస్లావత్ లలిత, నూజివీడుకు చెందిన మారుమూడి అచ్చియ్య, హరికోటి కిరణ్ ప్రకాశ్‌ను అరెస్టు చేశారు. దాడిలో సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ కె. సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

గంపలగూడెం: పుట్టపర్తి సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలను శనివారం గంపలగూడెంలో ఘనంగా నిర్వహించారు. సత్యసాయిబాబా భజన మండలి ఆధ్వర్యంలో కన్వీనర్ చారుగుండ్ల కృష్ణారావు గృహం వద్ద ప్రత్యేక కార్యక్రమాలు జరిపారు. తెల్లవారుజామున నగర సంకీర్తన, సాయిబాబా పాదుకలకు అభిషేకం నిర్వహించారు. అనంతరం 99 మంది వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లను పంపిణీ చేశారు. రాత్రికి నిర్వహించిన జన్మదిన వేడుకల్లో భక్తులు బాబా కీర్తనలు ఆలపించి భజన చేశారు.

- విస్సన్నపేట: స్థానిక భగవాన్ సత్యసాయి సేవా మందిరంలో సత్య సాయిబాబా జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మందిరంలో ప్రత్యేక పూజలు, వీధుల్లో పల్లకీసేవ నిర్వహించారు. సేవా సమితి కన్వీనర్ జగ్గవరపు రంగారెడ్డి, సాయిబాబా భక్తులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



చంద్రుపట్ల(విస్సన్నపేట): చంద్రుపట్ల ఎంపీయూపీ పాఠశాలను తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి శనివారం సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాల హెచ్‌ఎం నాగమాధురి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- విస్సన్నపేట: ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2025లో భాగంగా శనివారం మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. పుత్రేల గ్రామంలో 143, 145, చంద్రుపట్ల గ్రామంలో 170 పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ లక్ష్మీకల్యాణి పరిశీలించారు. బూత్ లెవల్ అధికారులకు పలు సూచనలు చేశారు.

దాసాంజనేయస్వామికి కార్తిక పూజలు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి రామిశెట్టి వారి వీధిలోని దాసాంజనేయ స్వామి ఆలయంలో కార్తిక మాస పూజలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి ఆకుపూజ, సిందూర అభిషేకం, విశేష అర్చనలు జరిపారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సుమారు ఐదు వేల మందికి అన్నదానం చేశారు.

మెప్మా బజార్ ఏర్పాటు

నూజివీడు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం మెప్మా బజార్ (అర్బన్ మార్కెట్)ను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పట్టణంలోని స్వయం సహాయక సంఘాల మహిళలు వివిధ బ్యాంకుల్లో రుణాలు తీసుకుని వ్యాపారాలు చేస్తున్న వారు, కుటీర పరిశ్రమల ద్వారా చేస్తున్న ఉత్పత్తులను ఈ మెప్మా బజార్‌లో ప్రదర్శించి విక్రయించారు. ఆహార, వస్త్ర సంబంధిత, ఆభరణాలు, అల్లికల సంబంధిత ఉత్పత్తులను ప్రదర్శించారు. మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకట రామిరెడ్డి వీటిని పరిశీలించి అభినందించారు. పట్టణంలోని పేద వర్గాల మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు, వారి ఉత్పత్తులను విక్రయించుకునేందుకు మెప్మా బజార్‌ను ప్రతి నెలా మూడో వారంలో ఏర్పాటు చేస్తామన్నారు. మెప్మా ఇన్‌చార్జి సీఎంఎం లటికే నాగోజీ, ఆర్పీలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉద్యమించాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నూజివీడు: విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయికరణకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డి. శివకుమార్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు ఈనెల 27 నుంచి 30 వరకు విజయనగరంలో నిర్వహించనున్న నేపథ్యంలో దానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం నూజివీడులో ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్నామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని వెంటనే అమలు చేయాలని, ఉన్నత చదువులకు శాపంగా మారిన జీఓ నంబర్ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య విద్యను ప్రైవేటీకరణ చేస్తున్న జీఓ నంబర్ 107, 108 రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వం విస్మరించిందని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు పెండింగ్ మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు గుడ్డేటి వంశీ, ఆకాష్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నూజివీడు: మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని ఎక్సైజ్ నూజివీడు సీఐ ఎ. మస్తానయ్య అన్నారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై శనివారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సుంకొల్లులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను, గంజాయి వంటి వాటిని సేవించడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని, నాడీ మండలంపై తీవ్ర ప్రభావం చూపుతుందని చెప్పారు. వాటికి దూరంగా ఉండాలన్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా నేరమని, అలాంటి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఎక్కడైనా బెల్టుషాపులు నిర్వహిస్తే సెల్: 99495 39933 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పనివేళల మార్పుపై ఉపాధ్యాయుల నిరసన



చెక్కపల్లిలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ముసునూరు: హైస్కూళ్ల పనివేళల్లో మార్పులు, చేర్పులు వద్దని పాత పనివేళలనే కొనసాగించాలని యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మకిశోర్, జి.రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ నేతల ఆధ్వర్యంలో చెక్కపల్లి జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయులు శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. నేతలు మాట్లాడుతూ హైస్కూళ్లలో పాత పని వేళలే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోశాధికారి నక్కా నారాయణ, కౌన్సిల్ సభ్యులు పద్మలత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మాలల ఆత్మగౌరవ సభ

నూజివీడు: పట్టణంలోని రాజీవ్ సర్కిల్ వద్ద ఆదివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించే మాలల ఆత్మగౌరవ సభలో మాలలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మాల యోధుల సంక్షేమ సంఘం పిలుపునిచ్చింది. స్థానిక బహిరంగ సభా ప్రాంగణంలో శనివారం నాయకులు విలేకరులతో మాట్లాడుతూ రిజర్వేషన్లను ఎత్తేయడానికి దేశ వ్యాప్తంగా కుట్ర జరుగుతోందని, దీనిని సమర్థవంతంగా తిప్పి కొట్టేందుకు ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీలకు ఉన్న 15 శాతం రిజర్వేషన్‌ను ముక్కలు చేయడం కాదని, దానిని 25 శాతానికి పెంచుకునేందుకు పోరాటం చేయాలన్నారు. రానున్న రోజుల్లో రిజర్వేషన్లను కాపాడుకునేందుకు మాలలు రాజీలేని పోరాటాలు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, నత్తా నాగేశ్వరరావు, పిల్లా చరణ్, మోచర్ల కృష్ణంరాజు, బుర్రి సుధాకర్, కాలి సుగుణరావు, చేబత్తిన మున్నా, బల్రే ఇళయరాజా తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్యవైశ్య సమాజం ఎన్నికలు

తిరువూరు: తిరువూరు ఆర్యవైశ్య సమాజ కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జరుగుతాయని ఎన్నికల అధికారి కొత్తగుండ్ల ప్రసాదరావు తెలిపారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి పదవులకు, 10 కార్యవర్గ సభ్యుల స్థానాలకు ఎన్నిక జరుగుతుందన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, అనంతరం ఫలితాలు వెల్లడిస్తామని చెప్పారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మైలవరం: రెడ్డిగూడెంలోని వికాస్ కళాశాల, రంగాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల విద్యాలయం, కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థులకు భారత రాజ్యాంగం–ఆవశ్యకత అంశంపై శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్థానిక ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన పోటీలను తెలుగు అధ్యాపకుడు ముంగా జయరాజు పర్యవేక్షించారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా ఈనెల 26న విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని సొసైటీ అధ్యక్షుడు చాట్ల విజయకుమార్ తెలిపారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు విద్యార్థులు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని తిరువూరు సహాయ సాంఘిక సంక్షేమాధికారి గాయత్రి అన్నారు. జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో ఉపకార వేతనాలకు కొత్త దరఖాస్తులు, రెన్యూవల్ దరఖాస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, ఓసీ, కాపు, ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థులు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ అనంతరం సంబంధిత సచివాలయంలో పరిశీలన ప్రక్రియ పూర్తి చేయించుకోవాలని సూచించారు. విద్యార్థుల బ్యాంకు ఖాతాను ఆధార్‌కు ఎన్‌పీసీఎల్ లింక్ చేసుకోవాలన్నారు.

నిబంధనలకు తూట్లు



నూజివీడు: పట్టణంలో బస్టాండ్ సెంటర్ అత్యంత రద్దీగా ఉంటుంది. రెండు వైపులా ఆటోల పార్కింగ్‌తోపాటు విజయవాడకు చెందిన సీఎన్‌జీ బస్సులు సైతం రోడ్డుపైనే నిలుపుతుండటంతో ఇప్పటికే ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీనికితోడు ఇప్పుడు అనుమతి లేకుండా, నిబంధనలు పాటించకుండా విగ్రహ ఏర్పాటుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆర్అండ్‌బీ రహదారి అంచున, బస్టాండ్ షాపింగ్ కాంప్లెక్స్ ఎదురుగా ఇష్టారాజ్యంగా పిల్లర్ ఏర్పాటు చేసి దానిపై శ్లాబు పోస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.